ఘనంగా క్రోధి నామ ఉగాది వేడుకలు


గాజుల అలంకరణలో పద్మావతి అమ్మవారు


వజ్రకవచ అలంకారంలో శ్రీవెంకటేశ్వరస్వామి వారు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష అలంకరణ :


పంచముఖ ఆంజనేయ స్వామికి తమలపాకులతో అర్చన


పులిహోరతో తీర్చిదిద్దిన స్వామి వారి రూపం

- ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు
- వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ వ్యాప్తంగా క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి అమ్మ వార్లను దర్శించుకుని, పంచాంగ శ్రవణాలను శ్రద్ధగా తిలకించారు. వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాలకు భక్తులకు తాకిడి పెరిగింది. చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, శ్రీపద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయం, భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, సారంగం సమీపంలోని శ్రీనూకాలమ్మ అమ్మవారి ఆలయం, కొత్తపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీ పద్మావతి , గోదాదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి సుప్రభాతం, తిరుప్పావడ సేవ, వజ్రకవచ అలంకారం జరిగింది. సుమారు 140 కేజీల పులిహోరతో చేసిన స్వామి వారి ప్రతిరూపం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం పులిహోర ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. పద్మావతి అమ్మవారికి గాజులతో విశేషంగా అలంకరించారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విజయదుర్గ అమ్మవారికి కుంకుమార్చన, పంచముఖ ఆంజనేయ స్వామి వారికి తమలపాకులతో అర్చన జరిగింది. ఆయా దేవతా మూర్తులకు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్‌లు పూజా కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.

కొత్తపేట పరిధిలో..

కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ రావూరి వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా స్వామి వార్లను దర్శించుకున్నారు. సారంగం రోడ్డులోని నూకాలమ్మ గుడిలో అమ్మవారి జాతర మహోత్సవాలు రెండో రోజుకు చేరాయి. జాతర మహోత్సవాలు, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. పలువురు భక్తులు కుంకుమార్చనలో పాల్గొనగా, అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


మేళతాళాలతో స్వామివారికి విభూదిని తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

వైభవంగా శ్రీ వారి కల్యాణం

శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉగాది వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేకంగా వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. పలువురు నూతన దస్త్రాలను నిర్వహించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి శాంతి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను మేళతాళాలతో వేదికపైకి తీసుకొచ్చారు. అనంతరం విశ్వక్సేన పూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కల్యాణోత్సవంలోని వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

విజయ డెయిరీలో పంచాంగ శ్రవణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): క్రోధి నామ సంవత్సరాదిని పురస్కరించుకుని కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ)లో మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలప్రాజెక్టు ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో పంచాంగ శ్రవణం జరిగింది. వేడుకలకు ముఖ్య అతిథిగా గజల్ శ్రీనివాస్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేయగా, పంతులు వెంకటేశ్వరరావు, విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పంతులు వెంకటేశ్వరరావు గారిచే పంచాంగ శ్రవణం జరిగింది. రానున్న సంవత్సరంలో ఆయా రాశుల స్థితిగతులు, వర్షాభావ పరిస్థితులు, రైతుల స్థితిగతులను ఆయన వివరించారు. జిల్లాలోని పాడి రైతులు, పాల వినియోగదారులకు క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలను చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. భవిష్యత్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధన్‌రావు, ఉయ్యూరు అంజిరెడ్డి, ఆర్జా వెంకట నగేష్, చలసాని చక్రపాణి, వేమూరి వెంకట సాయిరమణ, పలగాని కొండలరావు, పాలడుగు వెంకట రామ వరప్రసాద్, నెక్కలపు వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో ఉగాది సంబరాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి మహిళా మండలి - ఠాగూర్ గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు రంగవల్లులు వేసి వాటిని అందంగా అలంకరించారు. మహిళలు తమ సృజనను చూపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కే రమాదేవి మాట్లాడుతూ మహిళలు ఇంటి పనుల్లో తీరిక లేకుండా ఉంటారని, వారిలో దాగిన సృజనను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. ఉత్సాహంగా ఆట, పాటల్లో రాణించారన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో జ్యోతి మహిళా మండలి అధ్యక్షురాలు గంధం ఝాన్సీ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పంచాంగ శ్రవణాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలోని అన్ని శైవ, వైష్ణవాలయాలతో పాటుగా శక్తి ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న కోదండరామస్వామి వారి దేవస్థానం, పాండరంగ స్వామి వారి దేవస్థానం, నగరేశ్వరస్వామి వారి దేవస్థానం, అలాగే శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరం తదితర ఆలయాలతో పాటు కొత్తపేట నగరాల రామాలయం తదితర ఆలయాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ హాల్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఏపీ జెన్‌కో విశ్రాంత డైరెక్టర్ సాలి ఆంజనేయరావు, విశిష్ట అతిథులుగా రిటైర్డ్ ఎంపీడీఓ అబ్బిలి ఆంజనేయులు, రిటైర్డ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ తెలగరెడ్డి సత్యానందం హాజరయ్యారు. తొలుత విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆవంచ వేణుగోపాల రాధాకృష్ణమూర్తి పంచాంగ పఠనం చేశారు. అనంతరం సూరిశెట్టి రామయ్య-మహాలక్ష్మి మెమోరియల్ నిర్వాహకులు నిర్వహించిన క్యారమ్స్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ప్రతాప్ శ్రీనివాసరావు, యెనిగళ్ల సుబ్బారావు, సందక కృష్ణ, చతుర్థ బహుమతి వెలివెల రవికి అందజేశారు. రోలింగ్ షీల్డ్‌ను ప్రతాప శ్రీనివాసరావుకు బహూకరించారు. విశ్రాంత సంస్కృత అధ్యాపకులు పమిడిపాటి పట్టాభి రామారావు ఉగాది కవితలు వినిపించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించగా కార్యదర్శి సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు పి.రామారావు, జాయింట్ సెక్రటరీ యేమినేని వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు బి.శివ నాగేశ్వరరావు, ఇనయతుల్లా పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి భస్మార్చన

శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రారంభం, ఉగాది పర్వదినం సందర్భముగా మల్లేశ్వర స్వామి వారికి భస్మార్చన (విభూదితో)ను విశేషంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం శ్రీ అమ్మవారికి, ఉపాలయాల దేవతామూర్తులకు 'స్నపనాభిషేకం', అనంతరం ఖడ్గమాల అర్చన, నివేదన, హారతి కార్యక్రమాలు ఏకాంతంగా నిర్వహించారు. అదేవిధంగా ఉదయం 7 గంటలకు శ్రీ స్వామి వారికి భస్మార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం శ్రీ మల్లేశ్వర స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకారం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈవో ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.


పంచాంగ శ్రవణం చేస్తున్న వెంకటేశ్వరరావు


సర్టిఫికెట్లు అందుకున్న విజేతలతో గ్రంథాలయాధికారి రమాదేవి


క్యారమ్స్ రోలింగ్ షీల్డ్ అందుకుంటున్న శ్రీనివాసరావు

వైఎస్ జగన్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు

- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్
- పార్టీ పశ్చిమ కార్యాలయంలో ఉగాది వేడుకలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధితో పేద ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, వారు అదే విధంగా ఉండాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యాధరపురంలోని పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలు వైభవంగా జరిగాయి. ముస్లిం మైనార్టీ నాయకుడైనప్పటికీ ఆసిఫ్ అచ్చ తెలుగు సంప్రదాయ దుస్తుల్లో పూజలు చేయడం విశేషం. బుర్రా బాలకృష్ణ శర్మ .పంచాంగ శ్రవణం వినిపించగా ఆసిఫ్, పలువురు కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఆలకించారు. సంప్రదాయ వంటకాలతో ఏర్పాటు చేసిన విందు భోజనంతో అక్కడ పండుగ వాతావరణం వెల్లివిరిసింది.

మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే వస్తుంది..

పంచాంగకర్త బుర్రా బాలకృష్ణ శర్మ పంచాంగ పఠనం చేస్తూ రానున్న ఎన్నికల్లో ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. రానున్న ఏడాదిలో చిన్నపాటి ఇబ్బందులు ఎదురైనా రాజు వాటన్నింటిని అధిగమించి రాజ్యాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకువెళతారని పేర్కొన్నారు. అవసరం మేరకు వర్షాలు కురుస్తాయని తద్వారా పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ జాతకాలు బాగున్నాయని, వారి సంకల్పాలు నెరవేరతాయిని తెలిపారు.

పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ మంచి మనసుతో సీఎం జగన్ ఏ సంకల్పం తీసుకున్నా దానికి దేవుడి ఆశీస్సులుంటాయన్నారు. కోవిడ్ కష్టకాలంలో రెండేళ్ల పాటు విపత్కర పరిస్థితులను ఎదుర్కొని కూడా సంక్షేమాన్ని ఆపకుండా దృఢసంకల్పంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో రాష్ట్రం కరువు కాటకాలతో విలవిలలాడిందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు, భగవంతుని దీవెనలతో జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోక రావడం తథ్యమని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పంచాంగ శ్రవణం చేస్తున్న బాలకృష్ణ శర్మ, చిత్రంలో ఆసిఫ్, కార్పొరేటర్లు

మైనార్టీల అభ్యున్నతిపై కూటమికి చిత్తశుద్ధి లేదు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ముస్లిం మైనార్టీల అభ్యున్నతిపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చిత్తశుద్ధి లేదని, అందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి వ్యాఖ్యలే నిదర్శనమని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లను తాము అధికారంలోకి వస్తే ఎత్తివేస్తామని పురంధేశ్వరితో పాటు బీజేపీ నాయకులు పదే పదే వ్యాఖ్యానించటంపై ఆలోచన చేయాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆయన విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని మసీదు ఎ తయ్యబా కమిటీ మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. తొలుత కమిటీ పెద్దలు, స్థానిక ముస్లిం మైనార్టీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆసిఫ్‌ను మసీదు కమిటీ సభ్యులు సత్కరించి రానున్న ఎన్నికల్లో తామంతా అండగా నిలిచి మిమ్మల్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల మేలు కోసం సీఎం జగనన్న కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు ఆయన అనేక కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, బాజీ బాబా, అజీజ్, హుస్సేన్ షరీఫ్, మసీదు కమిటీ సభ్యులు తయ్యబ్, ఖదీర్ భాయ్, ఫయాజ్, జహంగీర్, జిలాని పాల్గొన్నారు.


మసీదు కమిటీ సభ్యులతో ఆసిఫ్

దుర్గమ్మ సన్నిధిలో కవి సమ్మేళనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాదిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కళావేదికపై మంగళవారం సాయంత్రం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. డాక్టర్ కప్పగంతు రామకృష్ణ సారథ్యంలో ప్రముఖ పండితులు పింగళి వెంకట కృష్ణారావు, డాక్టర్ జె.వి.చలపతిరావు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, వలివేటి శివరామకృష్ణ, పాంచాగ్నుల కృష్ణవేణి, డాక్టర్ యు.వి.రమణమూర్తి, దండిబోట్ల దత్తాత్రేయ శర్మ, పి.సత్యశైలజలు పాల్గొన్నారు. కాల మహత్యం, ప్రకృతి, వసంతం, కాలశక్తి, స్వరూపాలను మేళవిస్తూ చక్కటి ఆధ్యాత్మిక కవిత్వం చెప్పారు. అనంతరం దేవస్థానం కవి పండితులకు అమ్మవారి దర్శనం కల్పించి విశిష్ట సత్కారం చేశారు.

ఇంద్రకీలాద్రిపై ఉగాది వేడుకలు





శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయంలో పంచాంగ శ్రవణం, సాయంత్రం ఆది దంపతులకు వెండి రథంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరికలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతంలోని 38, 39, 41 డివిజన్లకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎమ్మెస్ పంజాటన్ రాహిహాక్ ఫౌండేషన్ అధ్యక్షుడు బషీరుల్లా, ఉపాధ్యక్షుడు జీఎంసీ అల్తాఫ్ నేతృత్వంలో సుమారు 50 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు చేరారు. వారికి పశ్చిమ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆసిఫ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ సుభాని, కటస్ కరిముల్లా, జీఎంసీ బాబా, దావూద్, జిలాని పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలోనే బీసీలకు గుర్తింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే బీసీలకు తగిన గుర్తింపు లభించిందని ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ పేర్కొన్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఆయన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, గుంటూరు ఎమ్మెల్యే అభ్యర్థిని విడదల రజనిని మంగళవారం కలిసి ముదిరాజ్ సంఘం తరుపున ఆమె విజయాన్ని కాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. మీ విజయానికి ముదిరాజు సామాజికవర్గం తరుపున తామంతా కృషి చేస్తామని మంత్రి విడదల రజనీకి తెలియజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత పెద్ద ఎత్తున బీసీల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక సీఎం జగన్ అన్నారు. ముఖ్యంగా ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన విడదల రజనీకి మంత్రి పదవి ఇవ్వటం తమ జాతికే గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజు సంఘీయులంతా అన్ని జిల్లాల్లో పర్యటించి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రచారం చేస్తామని చెప్పారు.

అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం

విజయవాడకల్చరల్: బ్రాహ్మణ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకట దశరథ రమేష్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘానికి నూతన కార్యవర్గాన్ని మంగళవారం సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా డాక్టర్ బీవీ గురునాథ శర్మ, ఉపాధ్యక్షులుగా కాశీభట్ల సూర్యనారాయణ శాస్త్రి, కావూరి సత్యనారాయణ మూర్తి, యడ్లపాటి శేష సాయి, కె.శ్రీనివాసరావు, కామర్స్ రాజేష్, కొల్లిపర సతీష్, మేడికొండూరి ప్రసాదరావు, తాళ్లూరి రాజీవ్ శర్మ కార్యదర్శులుగా కామర్స్ మాధవి, యడ్లపాటి శిరీషా రాణి, అనుముల విజయలక్ష్మి, లక్ష్మీ కల్యాణిలను ఎన్నుకున్నామన్నారు.

దుర్గగుడి ఘాట్‌రోడ్డులో విజయ పార్లర్ ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద కృష్ణా మిల్క్ యూనియన్ పార్లర్‌ను మంగళవారం ప్రారంభించారు. విజయ పార్లర్‌ను ఆలయ ఈవో కె.ఎస్.రామరావు ప్రారంభించి భక్తులకు మజ్జిగను అందజేశారు. భక్తులకు చల్లటి మజ్జిగతో పాటు విజయ ఉత్పత్తులను విక్రయించేందుకు కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): వేసవి కాలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఎంతగానో దోహదం చేస్తాయని భవానీపురం సీఐ కృష్ణ పేర్కొన్నారు. మానవతావాది జక్కిరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం భవానీపురం చర్చి సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రజలకు చల్లని మజ్జిగ, తాగునీరు అందజేశారు. సీఐ కృష్ణ మాట్లాడుతూ స్థానిక ఊర్మిళానగర్ సీతారెడ్డి కాలనీవాసులు ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. భవానీపురంలోని కొండవీడు అకాడమి నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించి విద్యార్థులకు హాస్టల్, అనాథ ఆశ్రమం, వృద్ధ ఆశ్రమం వంటివి నిర్మించిన జక్కిరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి చిరస్మరణీయుడన్నారు. కాలనీవాసులు బొమ్మారెడ్డి ప్రసాద్ రెడ్డి, బోయపాటి వెంకటరావు, పులిపాటి దుర్గారెడ్డి, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి, దాసరి రామకృష్ణ, చింతమరెడ్డి వెంకటరెడ్డి, మూలె కొండారెడ్డి, పులిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.